సాక్షి
వికారాబాద్
ఆదివారం, 9, ఏప్రిల్, 2023



వేధించే వార్డెన్ మాకొద్దు

వేధింపులకు గురిచేస్తున్న వార్డెన్ శశిరేఖ తమకు వద్దంటూ బషీరాబాద్‌లోని బీసీ బాలుర వసతిగృహం విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. 8లో▸



నిలిచిన బీమా..

పశుబీమా పథకం నిలిచిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో▸



సమస్యల వలయంలో లైబ్రరీ

విజ్ఞానాన్ని అందించాల్సిన గ్రంథాలయాలు పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. 9లో▸

రంజాన్ వేళలు

ఆదివారం ఇఫ్తార్	సోమవారం సహర్
సా.6:36	ఉ.4:40

న్యూస్‌రీల్

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి



మీర్జాపూర్‌లో ఆంజనేయస్వామికి పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మీర్జాపూర్ హనుమాన్ ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలను వైభవంగా నిర్వహించారు. పరిగి మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ అవుట్.. ఫోన్లు మాయం!

- అనుమానితులను ఠాణాకు పిలిపించి విచారణ
- పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని జర్నలిస్టుల ఆందోళన

తాండూరు: తాండూరులో జరిగిన పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం కొంత మందికి తలనొప్పిగా మారింది. ఈ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న బందెప్ప, సమ్మప్పలు ఎవరెవరికి పేపర్ షేర్ చేశారనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో కొంతమంది ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్లలోని డాటాను తొలగించడంతో పాటు పాత ఫోన్లను దాచేసి, కొత్త ఫోన్లు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. తాండూరులో జరిగిన పదో తరగతి పేపర్ లీక్ అంశాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తరచూ ప్రస్తావించడం హాట్ టాపిక్‌గా మారుతోంది. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో భాగంగా పలువురు అనుమానితులను ఠాణాకు పిలిపించి విచారణ చేస్తున్నారు. ప్రశ్నపత్రం ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు మరికొన్ని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ఉపాధ్యాయుడు బందెప్ప వాట్సాప్‌లో ప్రశ్నపత్రం షేర్ చేసిన వెంటనే ఓ యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు స్క్రీన్ షాట్ తీసుకొని ముగ్గురు జర్నలిస్టులతో పాటు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డికి పంపించాడు. పేపర్ లీకైందని పోలీసు అధికారికి సమాచారం ఇచ్చాడు. ఈ విషయమై సదరు వ్యక్తికి సంబంధించిన సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా పేపర్ బయటకు వచ్చిన రోజు నుంచి పోలీసు అధికారులు విచారణ పేరుతో ఇబ్బంది చేస్తున్నారని ఆరోపించాడు. ఈ విషయమై పలువురు జర్నలిస్టులతో కలిసి శనివారం సీఐని కలిశారు. ఈ కేసులో జర్నలిస్టుల పాత్ర లేకపోయినా పోలీసులు ఇబ్బందులకు గురిచేయడాన్ని తప్పుబడుతున్నారు.

అన్నోజిగూడలో గణాంక శాఖ అధికారుల సర్వే



కందుకూరు: జాతీయ గణాంక, పథకాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ గణాంక శాఖ ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్‌కు చెందిన అధికారుల బృందం శనివారం మండల పరిధిలోని అన్నోజిగూడలో పర్యటించింది. గణాంక శాఖ అధికారులు కొమ్మెర సతీష్‌కుమార్, కొత్త పృథ్వీరెడ్డి తదితరులు సర్వే చేపట్టారు. గృహ నిత్యావసరాల వినియోగం, ఖర్చుల తీరుపై గ్రామ పరిధిలోని కుటుంబాల్లో సర్వే నిర్వహించారు. విద్యార్హతలు, ఖర్చు, జీవన శైలి, వసతి తదితర సమాచారాన్ని సేకరించారు. దేశ సుస్థిర అభివృద్ధిలో భాగంగా నిర్వహించే ఇలాంటి సర్వేలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్‌ఎస్‌ఓకు ఇచ్చిన సమాచారం పూర్తి గోప్యంగా ఉంచుతామని, కచ్చితమైన సమాచారం ఇచ్చి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకి ఇందిర, ఉప సర్పంచ్ స్వరూప ఉన్నారు.


ఊరు మురిసింది

చీమల్‌దరికి అవార్డుల వెల్లువ కొనసాగుతోంది. మొదట మండల ఉత్తమ పంచాయతీల జాబితాలో చోటు దక్కించుకున్న ఈ పల్లె అక్కడినుంచి వెనుదిరిగి చూడకుండా జిల్లా, రాష్ట్ర స్థాయి బెస్ట్ జీపీగా ఎంపికైంది. మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితారెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్నారు ఆ గ్రామ సర్పంచ్ నానస్‌పల్లి నర్సింహారెడ్డి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ స్థాయి బెస్ట్ జీపీల్లోనూ చోటుదక్కించుకుంది ఈ ఊరు. సుపరిపాలన విభాగంలో అవార్డు వరించింది.

- చీమల్‌దరికి జాతీయ స్థాయి అవార్డు
- సుపరిపాలనలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక
- విశాలమైన అంతర్గత సీసీ రోడ్లు
- గ్రామమంతా అండర్ డ్రైనేజీ సిస్టం
- ప్రభుత్వ పాఠశాలలో ప్రొజెక్టర్ ద్వారా బోధన
- పల్లె ప్రకృతి వనంలో అరుదైన ఔషధ మొక్కలు
- జీపీ ఆదాయ, వ్యయాలన్నీ డిజిటల్ విధానంలోనే..



ప్రగతి భవన్ నమూనాలో నిర్మించిన రెండంతస్తుల మోడల్ పంచాయతీ భవనం



చీమల్‌దరిలోని పల్లె ప్రకృతి వనం



విశాలమైన సీసీ రోడ్లు, ఇరువైపులా పచ్చని చెట్లు

మోమిన్‌పేట: సుపరిపాలనలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైంది చీమల్‌దరి గ్రామం. పన్నుల వసూలు, వెంచర్ల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయానికి సంబంధించిన లావాదేవీలను డిజిటల్ విధానంలోనే నిర్వహించారు. పంచాయతీ ఆదాయ, వ్యయాలు గ్రామస్తులందరికీ తెలిసేలా బోర్డుపై ప్రదర్శిస్తున్నారు. పాఠశాలలో డిజిటల్ తరగతుల నిర్వహణకు దాతల సాయంతో ప్రొజెక్టర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకుంటూ ఈ గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది.

ప్రత్యేకతలివే

- గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు కనువిందు చేస్తాయి.
- పల్లె ప్రకృతి వనంలో సుమారు 50 రకాలు ఔషధ మొక్కలు దర్శనమిస్తాయి.
- వృద్ధులు సేదతీరేందుకు పార్కులో సిమెంటు కుర్చీలు ఏర్పాటుచేశారు.
- పిల్లలు ఆడుకోవడానికి అవసరమైన ఆట వస్తువులు, జారుడు బల్లలు, యువకులు వ్యాయామం చేసేందుకు అవసరమై ఓపెన్ జిమ్ అందుబాటులో ఉంది.
- ప్రగతి భవన్‌ను తలపించేలా రెండంతస్తుల్లో నిర్మించిన పంచాయతీ కార్యాలయం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.
- ఊరంతా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. దీంతో గ్రామస్తులకు దోమల బెడద తప్పింది.
- డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు అవసరమైన రుణాలు ఇప్పిస్తూ.. వారి అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తున్నారు.
- బాలల పరిరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందేలా పర్యవేక్షించడంతో పాటు అవసరమైన అన్ని వసతులు కల్పించారు.

ఎటుచూసినా పచ్చదనం

- నాలుగేళ్ల క్రితం చేపట్టిన పల్లె ప్రగతి పనుల్లో భాగంగా గ్రామంలోని బస్టాండ్ నుంచి మాదిరెడ్డిపల్లి మార్గంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన వేలాది మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.
- గ్రామంలోని అంతర్గత రోడ్లకు ఇరువైపులా ఉన్న బాదం చెట్లు చల్లని నీడతో పాటు చూపరులకు కనువిందు చేస్తున్నాయి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామంలోని పార్కు సందడిగా కనిపిస్తుంది.
- ఇక్కడ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌లో వృద్ధులు నడక సాగిస్తారు.
- ప్రకృతి వనంలోని మొక్కలన్నింటికీ డ్రిప్ ద్వారా నీటిని అందజేస్తున్నారు.

ప్రజల ఆశీస్సులతోనే..



పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తోంది. ఇందుకు అవసరమైన నిధులను సమకూరుస్తోంది. గ్రామ పరిధిలోని ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకుంటే ఎవరినీ అడిగే అవసరం ఉండదు. గ్రామ ప్రజల ఆశీస్సులతో రెండోసారి సర్పంచ్‌గా కొనసాగుతున్నా. ఇప్పటి వరకు రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టా. ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లె ప్రగతి ద్వారా గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. మా గ్రామం జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– ఎస్.నర్సింహారెడ్డి, సర్పంచ్, చీమల్‌దరి

అన్ని వసతులు కల్పిస్తున్నాం



పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపు విషయంలో స్థానికులు ఎంతో సహకరిస్తున్నారు. గ్రామంలోని ప్రతీ కాలనీతో పాటు ఇంటికి నంబర్లు సూచిస్తున్నాం. అంతర్గత రోడ్లను శుభ్రంగా ఉంచుతున్నాం. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నాం. గ్రామ సభ తీర్మానం మేరకే అభివృద్ధి పనులు చేపడుతున్నాం. తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోటుపాట్లకు తావీయడం లేదు. పంచాయతీ పాలకవర్గం, స్థానికుల సహకారంతోనే జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది.

– సుగుణ, పంచాయతీ కార్యదర్శి

ఆనందంగా ఉంది



మా గ్రామానికి జాతీయ స్థాయిలో సుపరిపాలన అవార్డు రావడం ఆనందంగా ఉంది. గ్రామానికి వచ్చిన అవార్డులే సర్పంచ్ నర్సింహారెడ్డి పనితీరుకు నిదర్శనం. సీఎం కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని తన గ్రామం అన్ని రంగాల్లోనూ ముందుండాలనే సంకల్పంతో సాగుతున్నారు. తన సొంత డబ్బులు వెచ్చించి గ్రామంలో హనుమాన్ ఆలయం నిర్మించారు. పారదర్శకమైన పాలన అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అధికారులు, ప్రజల సహకారంతోనే చీమల్‌దరికి జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. ఈ అవార్డు రావడం వెనక చాలా కృషిఉంది.

– చెన్నారెడ్డి, స్థానికుడు



పోలీసు వాహనాన్ని చుట్టుముట్టిన గ్రామస్తులు

ఆ పరిశ్రమను మూసివేయండి

- స్పాంజ్ ఐరన్ పరిశ్రమ ఎదుట గ్రామస్తుల ఆందోళన
- యాజమాన్య వైఖరిపై నిరసన
- ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు
- సర్దిచెప్పిన పోలీసులు

నందిగామ: వీర్లపల్లి శివారులోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమ వద్ద మూడు రోజులుగా కొనసాగుతున్న ఆందోళనలు శనివారం తీవ్ర రూపం దాల్చాయి. వందలాది మంది గ్రామస్తులు పరిశ్రమ గేటు ఎదుట బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విచక్షణా రహితంగా కాలుష్యాన్ని వదులుతున్నారని, దీంతో తాము అనారోగ్యాలకు గురవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమతో చర్చలు జరిపిన తర్వాతే పరిశ్రమలో ఉత్పత్తులు ప్రారంభిస్తామని చెప్పిన యాజమాన్యం మాట తప్పి యథావిధిగా పనులు ప్రారంభించటంతో గ్రామస్తులు పరిశ్రమలోకి దూసుకెళ్లి కార్మికులను బయటకు పంపి బంద్ చేయించారు. అనంతరం పరిశ్రమ యజమానులను నిలదీశారు. పరిశ్రమ యజమానులు గ్రామస్తుల నుంచి తప్పించుకొని వెళ్లేందుకు ప్రయత్నించగా వారి వెంటపడిన మహిళలు గేటు వద్దకు తీసుకొచ్చి కాలుష్యం గురించి ప్రశ్నించారు. ఇప్పటికే తమ గ్రామంలో నల్లటి బూడిద కమ్ముకొని పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి చేయిదాటిపోయే విధంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఇన్‌స్పెక్టర్ రామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది పరిశ్రమ వద్దకు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. అయినా వారు వినకపోవడంతో అతికష్టం మీద యజమానులను పోలీస్ వాహనం ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గ్రామస్తులు పోలీసుల వాహనాన్ని చుట్టుముట్టారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఇన్‌స్పెక్టర్ రామయ్య చాకచక్యంతో వారిని పీఎస్‌కు తరలించారు. నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చినట్లు తెలిసింది.

విద్యార్థులతో చెలగాటం తగదు

మంత్రి సబితారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

షాద్‌నగర్: విద్యార్థుల జీవితాలతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చెలగాటం ఆడుతున్నారని మంత్రి సబితారెడ్డి విమర్శించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ నేతల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అధ్యక్షతన పట్టణంలోని ఎల్‌ఎన్ గార్డెన్‌లో జరిగింది. సమావేశానికి మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ రమణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదో తరగతి పేపర్ లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్ కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఐటీఐఆర్ ప్రాజెక్టును ఎందుకు రద్దు చేసిందని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి తెలంగాణ ప్రజలపై చిత్తశుద్ధి, ప్రేమ ఉంటే వెంటనే ఐటీఐఆర్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది ఉద్యోగాలకు అవకాశం ఉన్న ఫార్మా సిటీకి వెంటనే అనుమతులు ఇవ్వాలని, పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు మెడికల్ కళాశాలలు మంజూరు చేసి తెలంగాణకు ఎందుకు చేయలేదని నిలదీశారు. కేంద్రం తెలంగాణకు చేస్తున్న అన్యాయాలను ప్రశ్నిస్తుంటే బీజేపీ నేతలు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలపై లేనిపోని విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుంటే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిత్యావసర సరుకులతో పాటు జీఎస్టీ పేరుతో వస్తువుల ధరలను పెంచి నడ్డివిరుస్తోందని ఆమె ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. వాటిని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని, బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలు, విమర్శలను సమర్థంగా తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



కలెక్టర్ నారాయణరెడ్డికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి

యాదాద్రీశుడి సేవలో కలెక్టర్

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని శనివారం రాత్రి కలెక్టర్ నారాయణరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆశీర్వచనాలు చేసి, లడ్డూ ప్రసాదం అందజేశారు.

– అనంతగిరి

ఎస్‌ఐ పరీక్ష ప్రశాంతం

రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్



టీకేఆర్ కళాశాలలో ఎస్‌ఐ రాత పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన రాచకొండ డీఎస్ చౌహాన్

మీర్‌పేట: పోలీసు శాఖ ఎస్‌ఐ తుదిరాత పరీక్ష మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో శనివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ సందర్శించి బందోబస్తు, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌ఐతో పాటు పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, సెల్‌ఫోన్‌లను పరీక్షా కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించడం లేదని తెలిపారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే అనుమతిస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాలలోని 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కమిషనర్ వెంట ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, మీర్‌పేట సీఐ మహేందర్‌రెడ్డి ఉన్నారు.

పట్నం దారెటు..?

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బలమైన నేతగా పేరున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కొద్దికాలంగా మౌనం దాల్చడంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఇందుకు కారణం ఏమై ఉంటుందా..? అని ఆరా తీసే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధికార బీఆర్‌ఎస్‌కు అసమ్మతి సెగ పెరుగుతోంది.

మౌనముద్రలో మహేంద్రుడు

- వ్యూహాత్మకమా..? 'మార్పు' కోసమా?
- బీఆర్‌ఎస్‌లో ఊపందుకున్న అసమ్మతి రాగం
- రెండు వర్గాలుగా విడిపోయిన గులాబీ శ్రేణులు
- ఎటూ తేల్చని అధిష్టానం

వికారాబాద్: జిల్లాలో ఏ నియోజకవర్గంలో చూసినా.. తన మార్క్ ప్రదర్శిస్తూ వచ్చిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి ఉన్నట్టుండి సైలెంట్ అయ్యారు. ఇది రాజకీయ ఎత్తుగడకు సంబంధించిన వ్యూహాత్మక మౌనమేననే వాదనలు ఊపందుకున్నాయి. ఓ పక్క అన్ని నియోజకవర్గాల్లో పట్నం వర్గంగా ముద్రపడిన నేతలందరూ జూలు విదిల్చి రెచ్చిపోతుండగా.. ఆయన మాత్రం స్తబ్దుగా ఉంటున్నారు. ఈ అంశాన్ని ప్రత్యర్థి వర్గీయులు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రధానంగా వికారాబాద్‌లో ఎమ్మెల్యే ఆనంద్ వర్గీయులు, తాండూరులో పైలెట్ మద్దతుదారులు మహేందర్‌రెడ్డిపై తీవ్రస్థాయి విమర్శలు చేస్తున్నారు. ఆయన బీజేపీ, కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉన్నారని, అందుకే అసంతృప్త నేతలను రెచ్చగొట్టి, బీఆర్‌ఎస్‌లో చీలిక తెచ్చేందుకు కుట్ర చేస్తున్నారని బహిరంగ ప్రకటనలు సైతం చేస్తున్నారు. ఈ ఆరోపణలను మహేందర్‌రెడ్డి వర్గీయులు తిప్పికొడుతున్నారు. బీఆర్‌ఎస్‌లో తామే సీనియర్లమని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వలసవాదులకు తమను విమర్శించే స్థాయి లేదని తేల్చిచెబుతున్నారు.

అసలు వ్యూహం ఇదేనా...?



మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి జిల్లాలోని బీఆర్‌ఎస్ అసంతృప్తవాదులకు లీడర్‌గా అవతరించారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆయన రెబల్ స్టార్‌గా అవతారమెత్తారనే టాక్ నడుస్తోంది. వాస్తవానికి కూడా ఒకరిద్దరు మినహా అధికార పార్టీలో ఉన్న అసమ్మతి నేతలందరూ పట్నం బాటలో నడవటం కూడా ఇందుకు బలం చేకూరుస్తోంది. వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో అధికార పార్టీకి రెబల్ గ్రూపు సంఖ్య పెరిగిపోగా.. క్రమంగా పరిగి, కొడంగల్‌కు సైతం పాకుతోంది. పరిగిలో మహేందర్‌రెడ్డి ముద్ర నేరుగా కనిపించనప్పటికీ డీసీసీబీ చైర్మన్ రూపంలో అక్కడ కూడా ఇటీవల ఎమ్మెల్యేకు వ్యతిరేక వర్గం తయారైంది. మరో బీసీ నేత నాగేందర్‌గౌడ్ సైతం పరిగి నుంచి ఎమ్మెల్యేగా బరిలో ఉంటానని ప్రచారం మొదలుపెట్టాడు. ఇక చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని నవాబుపేట మండలంలోనూ ఎమ్మెల్యే కాలె యాదయ్యకు అసమ్మతి పెరుగుతోంది. వీరికి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం నాయకత్వం వహిస్తుండగా ఓవరాల్‌గా మహేందర్‌రెడ్డి ప్రోద్బలంతోనే అసమ్మతి బలపడుతోందనే ప్రచారం సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో తన బలం, బలగం, ప్రాబల్యం ఎంత ఉంటుందో నిరూపించడం ద్వారా బీఆర్‌ఎస్ టికెట్ల కేటాయింపులో తన వర్గానికి ప్రాధాన్యం దక్కేలా చూడటమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

పార్టీకి నష్టమే..

అసెంబ్లీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సైతం మరో ఆరు నెలల్లో నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉంది. గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలకాల్సిన సమయమిది. కానీ వైరివర్గాలు పట్టు బిగిస్తుండటంతో అధికార పార్టీకి గడ్డు పరిస్థితి తప్పదనే సంకేతాలు జనంలోకి వెళ్తున్నాయి. ఈ విషయాన్ని సొంత పార్టీ నేతలే బాహాటంగానే చెబుతున్నారు. ఇప్పటి వరకు తాండూరు టికెట్ తనకే వస్తుందని చెబుతూ వచ్చిన మహేందర్‌రెడ్డి.. ప్రస్తుతం పార్టీ మారే యోచనలో ఉన్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. పైలెట్, పట్నం వర్గీయుల మధ్య అనేకసార్లు జరిగిన గొడవలు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితారెడ్డి వద్దకు చేరినా పరిష్కారం దొరకలేదు. దీంతో వీటికి ఫుల్‌స్టాప్ పడలేదు. 2018 ఎన్నికల్లో అధికార పార్టీకి మూడు అసెంబ్లీ స్థానాలు దక్కడంలో కేసీఆర్ పథకాలు, కేడర్ సమష్టి బాగా పనిచేశాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న గ్రూపు తగాదాలను అరికట్టే విషయంలో జిల్లా మంత్రి సైతం చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో అధిష్టానం స్పందించి, పరిస్థితులను చక్కదిద్దకపోతే వచ్చే ఎన్నికల్లో నష్టం తప్పదనే వాదన వినిపిస్తోంది.

క్లుప్తంగా

చిట్లపల్లి దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు


దర్గాలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్‌: మండల పరిధిలోని చిట్లపల్లి దర్గాలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్లపల్లి అబ్దుల్‌ సాహెబ్‌ దర్గాలో గంధం ఉత్సవాలు జరుగుతున్నాయి. వేలాది మంది భక్తులు దర్గాను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చిట్లపల్లి వెళ్లి దర్గాను దర్శించారు. పూలు ఛాదర్‌ కప్పి ప్రార్థించారు. దర్గా నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచు వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్‌ మధుయాదవ్‌, రాంరెడ్డి, చాంద్‌పాష తదితరులు పాల్గొన్నారు.

నావంద్గీలో ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు ఆపండి

కొనసాగుతున్న దీక్షలు


దీక్షలో పాల్గొన్న నాయకులు, మహిళలు

బషీరాబాద్‌: నావంద్గీ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు నిలపాలని మండల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు చేపడుతున్న నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం బీఆర్‌ఎస్‌ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు మద్దతు తెలిపారు. ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు నిలపాలని ఎంతో కాలంగా అధికారులకు, కేంద్రమంత్రులకు వినతులు ఇచ్చినా స్పందించక పోవడంతో వారం రోజులుగా ప్రజాప్రతినిధులు, నాయకులు దీక్షలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నావంద్గీ స్టేషన్‌ నుంచి హైదరాబాద్‌, బెంగళూరు, ముంబయి, పూణె వంటి నగరాలకు రోజు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని అన్నారు. ఇక్కడ రైళ్లు నిలపక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ జయమ్మ, నాయకులు జయరాం చారి, రాజన్న, వడ్డే హన్మంతు, మురళీమనోహర్‌రెడ్డి, తాహేర్‌బాండ్‌, పాషా తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్‌

మొయినాబాద్‌రూరల్‌: విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదివితే అనుకున్న ఉద్యోగాలను సాధించగలరని మైక్రోసాఫ్ట్‌ ప్రిన్సిపాల్‌ సైంటిస్ట్‌ కొండపల్లి రంగనాథ్‌, కేఎల్‌ డీమ్డ్‌ యూనివర్సిటీ చాన్సలర్‌ సత్యనారాయణ అన్నారు. అగ్రగామి కార్పొరేట్‌ సంస్థల్లో తమ విద్యార్థులు వంద శాతం ప్లేస్‌మెంట్స్‌ పొందిన సందర్భంగా అజీజ్‌నగర్‌ సమీపంలోని కేఎల్‌ హైదరాబాద్‌ యూనివర్సిటీలో శనివారం ప్లేస్‌మెంట్‌ సక్సెస్‌మీట్‌–2023 నిర్వహించారు.

వేధించే వార్డెన్‌ మాకొద్దు

ఆమె ఉంటే మేము ఉండలేం

- జీసీ వెల్ఫేర్‌ అధికారి ఎదుట విద్యార్థుల మొర
- విచారణ జరుగుతుండగా ఆత్మహత్యకు యత్నించిన వార్డెన్‌
- నిలువరించిన అధికారులు
- తాత్కాలికంగా విధుల నుంచి తొలగింపు


విచారణ జరుపుతున్న బీసీ వెల్ఫేర్‌ జిల్లా అధికారి ఉపేందర్‌

బషీరాబాద్‌: తమను వేధింపులకు గురిచేస్తున్న వార్డె న్‌ శిరేఖ మాకొద్దంటూ బీసీ హాస్టల్‌ విద్యార్థినులు స్పష్టం చేశారు. ఆమె వార్డెన్‌గా ఉంటే తాము హాస్టల్‌లో ఉండలేమని, అందరం ఇంటికి వెళ్తామంటూ విచారణకు వచ్చిన జిల్లా బీసీ వెల్ఫేర్‌ అధికారి ఉపేందర్‌తో మొరపెట్టుకున్నారు. లేటుగా నిద్రలేచారని మధ్యాహ్నం 12 గంటల వరకు


బాలికతో మాట్లాడుతున్న బీసీ నాయకులు


అల్పాహారం పెట్టని వార్డెన్‌ శిరేఖ తీరుపై విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బీసీ వెల్ఫేర్‌ జిల్లా అధికారి ఉపేందర్‌ అదే రోజు రాత్రి హాస్టల్‌ను సందర్శించి విచారణ జరిపారు. విచారణలో విస్తుపోయే విషయాలను విద్యార్థినులు బోరున విలపిస్తూ తెలిపారు. తమను చాలా రోజులుగా వేధింపులకు గురిచేస్తున్నారని, లేటుగాలేచామన్న కారణంగా బాత్‌రూమ్‌లకు వెళ్లకుండా నీటి సరఫరా బంద్‌ చేశారని వాపోయారు. కనీసం ముఖం కడుక్కోవడానికి కూడా నీళ్లు లేవని అన్నారు. నీరసంతో కింద పడిపోతున్నా మాకు భోజనం పెట్టలేదని వివరించారు. వార్డెన్‌ భర్త తమ గదుల్లోకి వస్తారని, అసభ్యంగా ప్రవర్తిస్తారని వెల్లడించారు. అంతకు ముందు ఎంపీపీ కరుణ, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ అజయ్‌ప్రసాద్‌, ఎంపీడీఓ రమేశ్‌కుమార్‌, స్థానిక నాయకులు బాలికలతో మాట్లాడారు. అయితే విచారణ జరుగుతుండగానే వార్డెన్‌ శిరేఖ తన గదిలోకి వెళ్లి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానిక నాయకులు, విచారణ అధికారి ఆమెను నిలువరించారు. జరిగిన ఘటనపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని విచారణ అధికారి తెలిపారు. వార్డెన్‌ను తాత్కాలికంగా విధుల నుంచి తప్పించినట్లు చెప్పారు. ఎస్సీ బాలికల హాస్టల్‌ వార్డెన్‌ రాధికకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. ఇదిలా ఉండగా వార్డెన్‌ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారన్న విషయం తెలుసుకున్న ఎస్‌ఐ విద్యాచరణరెడ్డి హాస్టల్‌కు చేరుకొని విచారణ జరిపారు. ఆమె ఆరోగ్యంగానే ఉన్నారని చెప్పారు.

కఠిన చర్యలు తీసుకోవాలి: శుభప్రద్‌ పటేల్‌

విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన వార్డెన్‌ శిరేఖపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్‌ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌ విచారణ అధికారికి సూచించారు. ఈ విషయాన్ని కలెక్టర్‌ దృష్టికి తీసికెళ్లినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా బీసీ సంఘం నాయకులు షుకూర్‌, నరేందర్‌ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులను పరామర్శించారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

జోరుగా శీతలపానీయాల విక్రయం

- ఉపాధి పొందుతున్న వలస జీవులు


వికారాబాద్‌లో జ్యూస్‌ బండి

వికారాబాద్‌ అర్బన్‌: ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో సమ్మర్‌ బిజినెస్‌ జోరుగా సాగుతోంది. సమ్మర్‌ బిజినెస్‌ను నమ్ముకొని ఇతర రాష్ట్రాల నుంచి వందల కుటుంబాలు వలసవచ్చి చిన్నచిన్న పట్టణాల్లో జీవనం సాగిస్తున్నాయి. ఈ వ్యాపారం సాధారణంగా ఫిబ్రవరి చివరి వారం నుంచే ప్రారంభమవుతోంది. 2020, 2021లో సమ్మర్‌ వ్యాపారాన్ని నమ్ముకొని వలస వచ్చిన వందల కుటుంబాలు కరోనా కారణంగా తీవ్రంగా నష్టపోయారు. అప్పట్లో అన్ని రకాలుగా పెట్టుబడులు పెట్టి వ్యాపారం ఊపందుకునే సమయంలో కరోనా మహమ్మారి విజృంభించడంతో వ్యాపారాలు వదిలేసి సొంత ఊర్లకు పరిగెత్తారు. గత ఏడాది నుంచి కరోనా భయం వీడటంతో తిరిగి వ్యాపారం ప్రారంభించారు. ఈ ఏడాది మార్చి మొదటి వారం నుంచే ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో చెరకు రసం, జ్యూస్‌ పాయింట్స్‌, ఐస్‌క్రీమ్‌ షాపులు బాగా నడుస్తున్నాయి. ప్రస్తుతం వికారాబాద్‌ పట్టణంలోని ప్రధాన రోడ్ల పక్కన చెరకు రసం వ్యాపారాలు సాగుతున్నాయి. వీరు కాకుండా కొందరు చెరకు బండ్లను నేరుగా వీధుల్లోకి తీసుకొచ్చి వ్యాపారం చేస్తున్నారు. అయితే చెరకు రసం వ్యాపారం చేస్తున్న వారిలో అత్యధికులు రాజస్థాన్‌, యూపీ వారే ఉన్నారు. ఇక ఐస్‌క్రీమ్‌, జ్యూస్‌ పాయింట్లు నడిపేది కూడా కర్ణాటక, యూపీ వారే. జ్యూస్‌ పాయింట్ల వద్ద ఎక్కువగా బత్తాయి వంటి జ్యూస్‌లను ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

రెండేళ్ల క్రితం చాలా నష్టపోయాం



పదిహేను ఏళ్లుగా ఇక్కడ జ్యూస్‌ వ్యాపారం చేసుకుంటున్నాను. పెట్టుబడి పోను రోజు రూ.500 వరకు మిగులుతుంది. కరోనా సమయంలో చాలా నష్టం వచ్చింది. గత ఏడాది కొంత పరవాలేదు. ఈ సారి బాగానే నడుస్తుంది.

– షోయబ్‌ అలీ, పండ్లరసం వ్యాపారి, యూపీ

ఈ ఏడాది చాలా మెరుగు



ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచి చెరకు రసం వ్యాపారం సాగుతుంది. కరోనా సమయంలో నష్ట పోయాం. ఇప్పుడు వ్యాపారం పరవాలేదు. వ్యాపారులు ఎక్కువగా ఉండటంతో గిరాక కొంత తగ్గింది. ఇందులో కూడా పోటీ బాగా పెరిగింది.

– జూహెద్‌, చెరకు రసం వ్యాపారి, యూపీ

నిరుద్యోగులతో సర్కార్‌ చెలగాటం



దీక్షలో పాల్గొన్న వైఎస్సార్‌టీపీ నాయకులు

వికారాబాద్‌ అర్బన్‌: నిరుద్యోగులతో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చెలగాటమాడుతోందని, నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌ టీపీ పోరాటం చేస్తుందని పార్టీ వికారాబాద్‌ నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రసాద్‌ తెలిపారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు శనివారం నుంచి 14వ తేదీ వరకు టీ– సేవ్‌ పేరుతో దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. సీఆర్‌ బిస్వాల్‌ కమిటీ చెప్పిన ప్రకారం వెంటనే 1.91 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. టీఎస్‌పీఎస్సీ బోర్డును వెంటనే ప్రక్షాళన చేయాలన్నారు. పేపర్ల లీకేజీ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని డిమాండ్‌ చేశారు. లీకేజీ అయిన పేపర్లను రద్దు చేసి తిరిగి పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకు గతంలో ప్రకటించిన రూ.3016 నిరుద్యోగ భృతిని వెంటనే ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన విరమించబోమన్నారు. ఈ సందర్భంగా జిల్లా యూత్‌ విభాగం అధ్యక్షుడు వేణుగోపాల్‌, జిల్లా అధికార ప్రతినిధి కావలి వసంత్‌ కుమార్‌, ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు బి.వీరేశం, ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు భయపడం

- వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌ కోళ్ల యాదయ్య


వైఎస్సార్‌టీపీ నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన

పరిగి: నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని, అడిగితే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నాదని, అయినా భయపడే ప్రసక్తేలేదని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌ కోళ్ల యాదయ్య అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీలపై పార్టీ అధినాయకురాలు నిరసన తెలుపుతుంటే అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ శనివారం పట్టణ కేంద్రంలోని వైఎస్సార్‌ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుంటే ఊరుకునే ప్రసక్తేలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయుడు నరేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన బీమా.. కానరాని ధీమా

- జాడలేని పశుబీమా పథకం
- పశువులు మృతి చెందినా పరిహారం అందక పాడిరైతుల ఇబ్బందులు
- అమలు చేయాలని సర్వత్రా విన్నపాలు


పాడిపశువులు

దౌల్తాబాద్‌: పశుబీమా పథకం నిలిచిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుబీమా, పంటల బీమాతో రైతులకు భరోసా కల్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశుబీమా మాత్రం గాలికి వదిలేశాయని వాపోతున్నారు. కొన్నేళ్లపాటు అమలు చేసిన పశుబీమాను ప్రభుత్వం నిలిపివేసింది. పశువులు మృతి చెందితే పరిహారం అందక బాధిత రైతులు నష్టపోతున్నారు. రైతుల కోసం ఎన్నో పథకాలను చేపడుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పే మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. పాడిపశువులకు బీమా ఉంటే ఆయా సంస్థల నుంచి గతంలో పశువు రకాన్ని బట్టి రూ.50వేల వరకు పరిహారం అందేది. వ్యవసాయంతో పాటు రైతులు పాడిపశువులు, గొర్రెలు, మేకలు పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు పాడిపశువులతో పాటు గొర్రెలు, మేకలను రాయితీపై అందిస్తున్నాయి. గొల్లకురుమలకు రాయితీపై గొర్రెలను పంపిణీ చేసింది.

సబ్సిడీ గొర్రెలకూ..

నాలుగేళ్ల క్రితం కొత్తగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకానికి ప్రభుత్వం మొదటిసారి బీమా సౌకర్యం కల్పించింది. కానీ ఏడాది తర్వాత బీమా ముగిసింది.రెన్యూవల్‌ చేయకపోవడంతో ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలకు ప్రస్తుతం బీమా లేకుండా పోయింది. రెండో విడతలో అందిస్తున్న గొర్రెలకు ఏడాది పాటు బీమాను కల్పిస్తుంది. గేదెలు, ఆవులకు ప్రభుత్వం ఎప్పటిలాగా 50 శాతం నిధులను కేటాయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాడిపరిశ్రమతో జీవనాధారం

మండలంలో పలు గ్రామాల్లో రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ జీవనాధారంగా మారింది. అన్ని గ్రామల్లో పాల ఉత్పత్తిదారుల సంఘం ఉండడంతో పాలడెయిరీలు ఏర్పాటు చేసుకుని పాలను విక్రయిస్తు జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా ఏటా వర్షాకాలంలో పిడుగుపాటుతో గొర్రెలు, మేకలు పశువులు మృతిచెందుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లోనూ పశువులు, జీవాల పెంపకందారులకు బీమా ప్రభుత్వ పరంగా పరిహారం అందక తీవ్రంగా నష్టపోతున్నారు.

అవకాశం కల్పించాలి



పాడిపశువులతో పాటు గొర్రెలు, మేకలకు బీమా సౌకర్యం కల్పిస్తే మేలు జరుగుతుంది. వ్యాధుల బారిన పడి ఇతర కారణాల వల్ల పశువులు మృతి చెందితే రైతులకు నష్టపరిహారం అందే అవకాశం ఉంది. ఇటీవల కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.1.50లక్షలు నష్టపోయాను. ప్రభుత్వం బీమా అమలు చేసి ఉంటే పరిహారం అందేది.

– పుల్లప్ప, దౌల్తాబాద్‌

ప్రభుత్వం బీమా నిలిపివేసింది

బీమా పథకాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో పాడిరైతులు ఇబ్బంది పడుతున్నారు. నాలుగేళ్లుగా ఈ పథకాన్ని నిలిపివేశారు. పశుబీమా పథకాన్ని అమలు చేస్తే ప్రమాదాల్లో పశువులు మృతిచెందితే రైతులకు ఆర్థిక సహాయం అందుతుంది.

– వరలక్ష్మి, పశువైద్యాధికారి

కొంతకాలం అందిన బీమా...

2009 నుంచి 2018 వరకు పశువుల బీమా పథకం అమలు చేశారు. పాడిరైతులు కొంత సొమ్ము చెల్లిస్తే ప్రభుత్వం కొంతబీమా చెల్లించేది.ప్రస్తుతం ప్రభుత్వం బీమాను నిలిపివేసింది.

బొంకూరుకు బ్రిడ్జి కలేనా!


బిజ్వార్‌-బొంకూరు మధ్య వాగు

- వర్షాకాలం వచ్చిందంటే వణుకుతున్న గ్రామస్తులు
- వరదొస్తే నిలిచిపోతున్న రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- నాయకులు దృష్టిసారించాలని విన్నపాలు

తాండూరు రూరల్‌: వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ ఊరి ప్రజలు భగవంతునిపై భారం వేస్తున్నారు. గ్రామం చుట్టూ వాగు పొంగి పొర్లడంతో ఊరికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. రెండు, మూడు రోజులు ఏకధాటిగా వర్షం కురిస్తే విద్యార్థులు పాఠశాలకు కూడా వెళ్లలేని పరిస్థితి. ఎన్నో ఏళ్లుగా వంతెన నిర్మించాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాండూరు మండలం బిజ్వార్‌ అనుబంధ గ్రామం బొంకూర్‌ ఉంది. ఈ గ్రామంలో ప్రజలు అధికంగా వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. బొంకూరు గ్రామానికి వెళ్లాలంటే బిజ్వార్‌ గ్రామ శివారులోని కాగ్నానది (వాగు)దాటాల్సిందే. నిత్యం ప్రజలు వాగుదాటి తాండూరు పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. రోజూ విద్యార్థులు వాగు దాటి బిజ్వార్‌ పాఠశాలకు వెళ్తుంటారు.

గతంలో బాలిక మృత్యువాత

వర్షాకాలం వచ్చిందంటే చాలు బొంకూరు గ్రామస్తులు కంటిమీద కునుకులేకుండా గడుపుతారు. గ్రామానికి చెందిన ఓ బాలికకు జ్వరం వచ్చింది. అప్పటికే వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. తాండూరు పట్టణంలోని ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి. ఎట్టకేలకు ట్రాక్టర్‌పై ఖాంజాపూర్‌ నుంచి తాండూరుకు ఆ బాలికను తరలించారు. అప్పటికే తీవ్ర జ్వరంతో ఆ బాలిక పరిస్థితి విషమించి మృతి చెందింది. బాలిక మృతి చెందిన వారం రోజులకు మరో వ్యక్తికి గుండెపోటు వచ్చింది. వాగు పొంగిపొర్లుతుండటం.. ఆస్పత్రికి తరలించడంలో ఆలస్యం కావడంతో ఆ వృద్ధుడు కూడా మరణించారు. అత్యవసరమైతే ట్రాక్టర్‌పై పెద్దేముల్‌ మండలం రుక్మాపూర్‌ మీదగా తాండూరు పట్టణానికి వెళ్తామని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికే గ్రామానికి చెందిన కొందరు తాండూరులో వచ్చి స్థిరపడ్డారు. కొందరు ఊరు, పొలాలు వదిలి ఎక్కడికి వెళ్లాలేని పరిస్థితి. దీంతో గ్రామంలో ఉండిపోయారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని బొంకూరు బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పల్లె జనమంతా ‘బలగ’మైంది


తుంకిమెట్లలో బలగం సినిమా తిలకిస్తున్న పల్లె జనం

బొంరాస్‌పేట: పల్లె జనమంతా ‘బలగం’గా మారుతోంది. ఎక్కడ చూసినా, ఏనోట విన్నా ‘బలగం’ ముచ్చట్లే. పల్లె నేపథ్యాన్ని ఇతివృత్తంగా చేసుకొని తెలంగాణ పల్లెల వ్యథలు, కథలను వెండి తెరమీదికి ఎక్కించారు డైరెక్టర్‌ వేణు. యూట్యూబ్‌, వాట్సప్‌లలో బలగం సినిమా చక్కర్లు కొడుతుండటంతో ఎనకటి కాలంలో వీధినాటకాలు, తోలుబొమ్మలాటల తీరుగా చిన్నతెరలు ఏర్పాటు చేసి బలగం సినిమాను చూపిస్తున్నారు. ఈమేరకు మండల పరిధిలోని తుంకిమెట్లలో శనివారం రాత్రి ప్రదర్శించారు. దీంతో గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా వచ్చి బలగం సినిమా చూసి మురిసిపోయారు. తమ గ్రామం సంగతులే అన్నట్లు ముచ్చటించుకున్నారు. ఇలాంటి సినిమాలు రావాలన్నారు.

బీఆర్‌ఎస్‌ కార్యకర్తలకు అండగా ఉంటాం


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

దోమ: గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ కార్యకర్త కిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే మహేశ్‌ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్‌ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీఆర్‌ఎస్‌ కార్యకర్తలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యకర్తలకు ఎలాంటి కష్టాలు ఎదురైనా అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ కావలి గోవర్దన్‌, నాయకులు వడ్యా నారాయణ నాయక్‌, లక్ష్మయ్య, రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

మొయినాబాద్‌: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఎనికేపల్లి గ్రామానికి చెందిన నడింపల్లి అశోక్‌(58) స్థానిక భాస్కర ఆస్పత్రిలో ఆఫీస్‌ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం ఆస్పత్రి నుంచి హిమాయత్‌నగర్‌ వైపు రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో నగరానికి చెందిన సమీ అబేది అనే విద్యార్థి మరో నలుగురు స్నేహితులతో కలిసి కారులో మొయినాబాద్‌లోని ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ విందుకు వెళ్తున్నారు. సమీ అబేది కారు అతివేగంతో నడపడంతో అదుపుతప్పి నడుచుకుంటూ వెళ్తున్న అశోక్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో అశోక్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు సంకటం



కోస్గి నుంచి తాండూరు టికెట్‌



తాండూరు నుంచి కోస్గి టికెట్‌

కొడంగల్‌: ప్రయాణికులపై ఆర్టీసీ అదనపు భారాన్ని మోపుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో వివిధ పనుల కోసం ఊర్లకు వెళ్లే వారికి ఒక్కో బస్సులో ఒక్కో ధరను తీసుకుంటున్నారు. అదనపు భారంగా ప్రయాణికులతో వసూలు చేస్తున్నారు. శనివారం ఉదయం కొంత మంది మహిళలు తాండూరు నుంచి కోస్గి వెళ్లారు. ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ఎక్కారు. కండక్టర్‌ తాండూరు నుంచి కోస్గి వరకు రూ.40 టికెట్‌ ఇచ్చారు. తిరుగు ప్రయాణంలో అదే మహిళలు కోస్గి నుంచి తాండూరుకు పల్లె వెలుగు బస్సు ఎక్కారు. తిరుగు ప్రయాణంలో కండక్టర్‌ రూ.70 టికెట్‌ ఇచ్చారు. ఇదేంటని సదరు మహిళలు ప్రశ్నిస్తే ఎంత టికెట్‌ ఉంటే అంత తీసుకుంటామని కండక్టర్‌ బదులిచ్చారు. దీంతో ప్రయాణికులు కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. పేదలను ఇబ్బందులకు గురి చేస్తే ఎలాగని ప్రశ్నించారు. ఒకే రోజు వచ్చేటప్పుడు ఉన్న టికెట్‌ ధర వెళ్లేటప్పుడు ఎందుకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ప్రయాణికులు పూర్తిగా దినసరి కూలీలు. వారి వాదనతో మిగిలిన ప్రయాణికులు ఏకీభవించారు. చేసేది లేక మధ్యలో దిగలేక అదనపు భారాన్ని చెల్లించి ప్రయాణించారు.